క్లుప్తంగా

ఘనంగా గీతా జయంతి వేడుకలు



యజ్ఞం చేస్తున్న భక్తులు

యలమంచిలి రూరల్: పట్టణంలోని కొత్తపేట రామాలయంలో బుధవారం గీతా జయంతి వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవపరివార్, గీతా ప్రచారకుడు సోమయాజులు ఆధ్వర్యంలో భగవద్గీతలో 700 స్లోకాలు పఠిస్తూ గీతా యజ్ఞం చేశారు. మనిషి జీవితానికి మార్గదర్శిగా పవిత్ర గ్రంథం భగవద్గీత ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. అనంతరం ఆలయంలో యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

16 నుంచి ధనుర్మాస పూజలు

మునగపాక: ఈ నెల 16 నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభమవుతాయని మునగపాక సీతారామ ఆలయ అర్చకుడు రేజేటి రాంబాబు తెలిపారు. వచ్చే నెల 13వ తేదీ వరకు ధనుర్మాసం కొనసాగుతుందన్నారు. 30 రోజుల పాటు ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని పేర్కొన్నారు. 13న భోగి పండగను పురస్కరించుకుని రామాలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

టి.సిరసపల్లిలో రెవెన్యూ సదస్సు నేడు

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లిలో గురువారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సిరసపల్లి సచివాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు రేవుపోలవరం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో సైన్స్ టీచర్ స్వర్ణగౌరి

ఎస్.రాయవరం: కౌశల్ సైన్స్ ప్రతిభాన్వేషణ రాష్ట్ర స్థాయి పోటీలకు రేవుపోలవరం ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు సైన్స్ టీచర్ స్వర్ణగౌరి తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సీహెచ్.నాగరాజు క్విజ్, కె.దయానంద్ షార్ట్ ఫిలింలో ప్రథమ స్థానం, సీహెచ్.ఐసు పోస్టల్ మేకింగ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ ముగ్గురూ త్వరలో విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆమె చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు శిక్షణ ఇచ్చిన టీచర్ స్వర్ణగౌరిని పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ మాజీ చైర్మన్ సీహెచ్ అప్పన్న, పీఆర్‌టీయూ మండల కార్యదర్శి శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

ఘనంగా సీతారామ ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని మూలపేటలో బుధవారం సీతారామ ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సీతారాములను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి ప్రసాదం స్వీకరించారు. సీతారాములు దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

పడకేసిన పశువైద్యం..!



రాంబిల్లి వైద్యుడు లేకపోవడంతో వైద్యం చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్

- శిథిల కమ్యూనిటీ భవనంలో రాంబిల్లి పశువుల ఆస్పత్రి
- వినియోగంలోకి రాని కొత్త భవనం
- మండలంలో ఐదు ఆస్పత్రులను వేధిస్తున్న సిబ్బంది కొరత
- మూగజీవాలకు అరకొర వైద్య సేవలు

రాంబిల్లి(యలమంచిలి): పశు వైద్యం పడకేసింది. మూగజీవాల వేదన అరణ్య రోదనగా మిగిలింది. వైద్యుల పోస్టులు భర్తీ చేయకపోవడంతో సిబ్బంది కొరత వేధిస్తోంది. శిథిల భవనాల్లో సిబ్బంది అరకొర వైద్య సేవలు అందిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. రాంబిల్లి మండల కేంద్రంలో ఉన్న పశువుల ఆస్పత్రి సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతోంది. రాంబిల్లిలోని శిథిలమైన కమ్యూనిటీ భవనంలో ఈ ఆస్పత్రి నడుస్తోంది. విధుల నిర్వహణకు అధికారులు నానా అవస్థలు పడుతున్నారు. గోవిందపాలెం వెళ్లే రోడ్డు పక్కన 2014లో కొత్త పశువుల ఆస్పత్రిని నిర్మించినా ఇప్పటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న కమ్యూనిటీ భవనంలో పశువుల ఆస్పత్రి కొనసాగుతోంది. ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాలకు శ్లాబు నుంచి పెచ్చులూడి నీళ్లు చిమ్ముతున్నాయి. భవనం లోపల ఉన్న మందులు తడిసిపోతున్నాయి. భవనం చుట్టూ తుప్పలు పెరిగిపోవడంతో ఈ ప్రాంతం అడవిని తలపిస్తోంది.



రాంబిల్లిలో కమ్యూనిటీ శిథిల భవనంలో నడుస్తున్న పశువుల ఆస్పత్రి



రాంబిల్లిలో గోవిందపాలెం వెళ్లే రోడ్డులో వాటర్ ట్యాంక్ వద్ద నిర్మించిన కొత్త పశువుల ఆస్పత్రి భవనం

గతమెంతో ఘనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పశువులకు వైద్య సేవలు సకాలంలో అందించాలనే సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ సచివాలయాల్లో వెటర్నరీ అసిస్టెంట్ల నియామకం చేశారు. వారు గ్రామాల్లో ఉంటూ పశువులకు అవసరమైన వైద్య సేవలు సకాలంలో అందించేవారు. రైతుల ఇంటికి వెళ్లి పశువులకు సేవలందించేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వారిని వివిధ పనులకు వినియోగించడంతో ఇంటింటి వైద్యం అటకెక్కిందని పాడి రైతులు నిట్టూరుస్తున్నారు.

డెప్యుటేషన్‌పై విధుల నిర్వహణ

రాంబిల్లి మండలంలో రాంబిల్లి, లాలం కోడూరు, పెదకలవలాపల్లి, వంచదార్ల, దిమిలి గ్రామాల్లో పశువుల ఆస్పత్రులు ఉన్నాయి. ఆయా ఆస్పత్రుల్లో పశువైద్య సిబ్బంది కొరత వేధిస్తోంది. గ్రామ సచివాలయంలో పని చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్‌లు డెప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పశువులకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదు. పశువైద్యులు అందుబాటులో లేకపోవడంతో, మూగజీవాలు మరణించిన ఘటనలూ చోటు చేసుకుంటున్నాయి. రాంబిల్లి మండలంలో పని చేస్తున్న పశువైద్యుడు దిమిలి పశువుల ఆస్పత్రికి కూడా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. రెండు ఆస్పత్రుల నిర్వహణ బాధ్యతలు ఆయనపై పడడంతో ఎక్కడా వైద్య సేవలు సకాలంలో అందించలేకపోతున్నారు. ఫలితంగా రాంబిల్లి పశువుల ఆస్పత్రి వద్ద మూగజీవాలను వైద్యం కోసం తీసుకువచ్చిన పాడి రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. ఆస్పత్రి తలుపులు తెరిచి ఉంటాయి తప్పా.. అక్కడ సిబ్బంది మాత్రం కానరావడం లేదని పాడి రైతులు చెబుతున్నారు. మరోవైపు ఈ భవనం రాత్రి పూట అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రి సమయాల్లో ఆస్పత్రి భవనం పైకి ఎక్కి కొంత మంది మందు పార్టీలు చేసుకుంటున్న ఘటనలు ఉన్నాయి.



శిథిల భవనంలో సంచులతో మూలన పడేసిన పశువుల మందులు

సకాలంలో అందని వైద్యం



మేకల పెంపకంతో ఉపాధి పొందుతున్నాను. తరచూ మేక పిల్లలు వ్యాధుల బారిన పడుతుంటాయి. పశు వైద్యులకు ఎన్ని సార్లు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదు. అలాగని ఆస్పత్రి వద్దకు మేకలను తీసుకువచ్చినా ఫలితం ఉండడం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఉంటోంది. మూగ జీవాలకు సకాలంలో వైద్యం అందడం లేదు.

– భూపతి అప్పారావు, కొండవారిపాలెం

గతంలో ఫోన్ చేస్తే ఇంటికి వచ్చి వైద్యం



నాటుకోళ్లను పెంచుకుంటూ జీవనం సాగిస్తుంటాను. తరచూ కోళ్లకు అనారోగ్యాలు సోకినప్పుడు వైద్యులకు ఫోన్ చేసినా పట్టించుకోవడంలేదు. ఏ సమస్య వచ్చినా రాంబిల్లి రావాల్సిందే. తీరా ఆస్పత్రికి వచ్చే సమయానికి డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండరు. వారి కోసం నిరీక్షణ తప్పడం లేదు. గతంలో ఫోన్ చేస్తే వైద్యులు ఇంటికి వచ్చి వైద్య సేవలదించేవారు. ఇప్పుడు ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఎత్తరు. కోళ్లను తీసుకొని ఆస్పత్రికి రావడం కష్టంగా ఉంటుంది.

– లాలం వెంకటలక్ష్మి, సంతపాలెం

సిబ్బంది కొరత ఉంది..

రాంబిల్లి మండలంలో ఉన్న ఐదు పశు వైద్య కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉంది. ముఖ్యంగా రాంబిల్లి, దిమిలి పశువుల ఆస్పత్రులకు సిబ్బంది లేరు. పక్క గ్రామాల సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్లతో పశువులకు వైద్య సేవలు అందిస్తున్న పరిస్థితి ఉంది. రాంబిల్లి, దిమిలి పశువుల ఆస్పత్రులను చూస్తున్నాను. దీంతో రైతులకు కొంత అసౌకర్యం కలుగుతోంది. అయినా సకాలంలోనే పశువులకు వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నాము. రాంబిల్లిలోని శిథిలమైన కమ్యూనిటీ భవనంలో ఆస్పత్రిని కొనసాగిస్తున్నాం. కొత్త భవనం నిర్మించినా అధికారులు మాకు అప్పగించలేదు.

– రఘునాథరావు, రాంబిల్లి పశువైద్యాధికారి

అందుబాటులో లేని వైద్యులు



పశు వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. పలు మార్లు ఫోన్ చేసినా పట్టించుకోవడం లేదు. గతంలో వైద్యులు ఇంటికి వచ్చి పశువులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేసేవారు. ఇప్పుడు పశువులకు ఏ సమస్య తలెత్తినా రాంబిల్లిలోని ఆస్పత్రి వద్ద వైద్యుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

– కోరింకోట నూకరాజు, రాంబిల్లి

అన్నదాతల్లో మళ్లీ కలవరం



యండపల్లిలో వరి కుప్ప వేస్తున్న రైతులు

కోటవురట్ల: చి'వరి'దశలో పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే తుపాను కారణంగా వరి కోతలు ఆలస్యం కాగా.. గింజ రాలిపోతుండడంతో గత రెండు రోజులుగా రైతులు పనులు మొదలెట్టారు. ముమ్మరంగా వ్యవసాయ పనులు నిర్వహిస్తున్నారు. జోరుగా కోతలు కోస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోసారి తుపాను హెచ్చరికలు వచ్చిన నేపథ్యంలో అన్నదాతల్లో మళ్లీ కలవరం మొదలైంది. ఇంకా ఆలస్యమైతే తీవ్ర నష్టమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. దాంతో కొందరు రైతులు దేవుడిపై భారం మోపి కోతలు చేపడుతున్నారు. మరికొందరు రైతులు వెనువెంటనే కుప్పలు వేసి పంటను దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలో ఎక్కడ చూసినా ఓ పక్క కోతలు, వరి కుప్పలు వేస్తూ రైతులు బిజీగా ఉన్నారు. ఇంకొందరు కూడా నూర్పులు నిర్వహించి గింజలను ఇంటికి చేర్చుకునేందుకు తాపత్రయపడుతున్నారు. జల్లూరు, యండపల్లి, అన్నవరం, తంగేడు, బి.కె.పల్లి, కోటవురట్ల, లింగాపురం, రాజుపేట, గొట్టివాడ, చౌడువాడ, రామచంద్రపురం, పందూరు, కె.వెంకటాపురం, పాములవాక తదితర గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

అజోల్లా పెంపకంతో మెరుగైన ఫలితాలు



మాట్లాడుతున్న మండల పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్

మునగపాక: రైతులు అజోల్లా పెంచడం ద్వారా పశువులకు దాణాతో పాటు మెరుగైన ఆదాయం ఆర్జించవచ్చని మండల పశు వైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని నాగవరంలో బుధవారం పశు సంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో పశువుల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధిగా ప్రతి పశువుకు నాలుగు నెలలకొకసారి పాముల మందు వేయాలన్నారు. స్థానికంగా అజోల్లాను పెంపకంపై దృష్టి సారించాలన్నారు. దీని వల్ల దాణా ఖర్చు తగ్గడంతో పాటు పాలలో వెన్న శాతం పెరుగుతుందన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 1800-4198800 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

సత్యవరంలో ఎరువుల మందుల షాపు ప్రారంభం



ఎరువులు, పురుగు మందుల షాప్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాసబాబు

పాయకరావుపేట: మండలంలోని సత్యవరం గ్రామంలో తాండవ వాలి ఉద్యానవన, వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువులు, పురుగు మందు షాప్‌ను ఐఐఎంఆర్ సీనియర్ సైంటిస్ట్ కె.శ్రీనివాసబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘంలో రైతులు సభ్యులుగా చేరితే అదనపు ప్రయోజనాలు పొందవచ్చునన్నారు. రైతులకు సాంకేతికతకు అవసరమైన సహకారం అందిస్తున్నామని తెలిపారు. ముఖ్యఅతిథిగా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఉమాప్రసాద్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, క్రిమి సంహారక మందులు అందించాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం యలమంచిలికి చెందిన శైలజ మాట్లాడుతూ రైతులకు అవసరమైన శిక్షణ, సలహాలు, సూచనలు అందిస్తామని తెలిపారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సకిలేటి రాము, సంఘం ముఖ్య కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణ, లంబసింగి రైతు సంఘం ముఖ్య కార్యనిర్వాహణాధికారి రాజేష్ పాల్గొన్నారు.

ప్రజల్లో భక్తి భావాలు పెంపు అభినందనీయం



ఆధ్యాత్మిక ప్రచారకర్త నూకరాజు దంపతులను సత్కరిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు జగన్నాథరావు

మునగపాక: ప్రజల్లో భక్తిభావాలు పెంపొందించడంలో ఆధ్యాత్మిక ప్రచారకర్త తేలు నూకరాజు సేవలు అభినందనీయమని విశ్రాంత ఉపాధ్యాయుడు పెంటకోట జగన్నాథరావు కొనియాడారు. మునగపాక మెయిన్‌రోడ్డులోని లింగరాయి గుడిలో కార్తీక మాసంలో నెలరోజుల పాటు ప్రజల్లో భక్తి భావాల పెంపుపై చేపట్టిన అవగాహన కార్యక్రమం బుధవారం ముగిసింది. అనంతరం గీతా జయంతి సందర్భంగా పలువురు నూకరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు మారిశెట్టి అప్పారావు, వేగి లక్ష్మణరావు, కాండ్రేగుల పరదేశిరావు, ఆడారి సన్యాసిరావు, కాండ్రేగుల సంధ్య, వేగి వీరు నాయుడు, మావూరి కాశీబు, పెంటకోట చిన్న, తదితరులు పాల్గొన్నారు.

డీలర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మునగపాక: మండలంలో ఖాళీగా ఉన్న రేషన్ డిపోలకు సంబంధించి డీలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. పలు కారణాలతో ఖాళీగా ఉన్న డిపోల వివరాలను ఆయన బుధవారం విలేకరులకు వివరించారు. మడకపాలెం (బీసీ-బీ), యాదగిరిపాలెం(బీసీ-ఈ), ఒంపోలు(ఎస్టీ), వెంకటాపురం(ఈడబ్ల్యూఎస్), కుమారపురం(బీసీ-డీ) కేటగిరీలకు కేటాయించారన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 13వ తేదీలోగా అనకాపల్లి ఆర్‌డీవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆయన కోరారు.

ఎస్.రాయవరం మండలంలో..

ఎస్.రాయవరం: మండలంలో ఖాళీగా ఉన్న ఆరు రేషన్ డిపోలకు డీలర్ల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తహసీల్దార్ జె.రమేష్ బాబు తెలిపారు. కొత్త రేవుపోలవరం, పేటసూదిపురం, బంగారమ్మపాలెం, వాకపాడు, పెదగుమ్ములూరు, సీతారాంపురం గ్రామాల్లో చదువుకున్న యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలతో దరఖాస్తులను ఈ నెల 13వ తేదీ లోగా నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం ఎస్.రాయవరం తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

నర్సీపట్నం : క్రికెట్ టోర్నమెంట్‌ను వినియోగించుకుని ప్రతిభను చాటాలని నర్సీపట్నం టౌన్ సీఐ జి.గోవిందరావు అన్నారు. నర్సీపట్నం పట్టణ కేంద్రంలో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం, రత్న టాటా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి ఉపకరిస్తాయన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నీని ఏర్పాటు చేసిన అకంరెడ్డి సురేష్‌ని అభినందించారు. నెల రోజుల పాటు జరిగే క్రికెట్ టోర్నమెంట్ ప్రశాంతంగా జరిగేందుకు క్రీడాకారులు నిర్వాహకులకు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. టోర్నమెంట్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ టోర్నమెంట్‌లో 8 టీమ్‌లు పాల్గొంటున్నాయని ఆర్గనైజర్ సురేష్ తెలిపారు. గెలుపొందిన ఫస్ట్, సెకెండ్ టీమ్‌లకు నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తామన్నారు. అనంతరం సీఐ టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ధనిమరెడ్డి మధు, టిడిపి నాయకులు లాలం మురళీ, పెదిరెడ్ల చింతు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

యలమంచిలి రూరల్: ఈ నెల 14న యలమంచిలి న్యాయస్థానాల ప్రాంగణంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ బుధవారం మీడియాకు తెలిపారు. ఇది కక్షిదారులకు ఒక సువర్ణావకాశమని, కోర్టుల్లో ఎప్పటి నుంచో ఉన్న కేసులను రాజీ చేసుకుని, ప్రశాంత జీవనం కోసం లోక్‌అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. క్రిమినల్, సివిల్, టెలిఫోన్ బిల్లులు, ప్రీ లిటిగేషన్, బ్యాంకు రుణాలు, మనోవర్తి కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని ఆమె తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న గంగప్పలనాయుడు

మునగపాక: మండలంలోని మూలపేటలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం సర్పంచ్ గంగప్పలనాయుడు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, ఆడారి జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

14న సాగునీటి సంఘాల ఎన్నికలు



పాయకరావుపేట ఎంపీడీవో కార్యాలయంలో నోటిఫికేషన్ ప్రతి అంటిస్తున్న సిబ్బంది

పాయకరావుపేట: ఈ నెల 14న సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్టు నీటి పారుదల శాఖ ఏఈ కె.శ్రీరామమూర్తి తెలిపారు. ఈ మేరకు ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ వివరాలను బుధవారం మండల పరిషత్, తహసీల్దార్, తుని మండల రెవెన్యూ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డులో అంటించారు. ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్టు ఏఈ తెలిపారు.

అర్జీలకు 15 రోజుల్లో పరిష్కారం



దేవవరం రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

నక్కపల్లి: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలకు 15 రోజుల్లో పరిష్కరిస్తామని డిప్యూటీ తహసీల్దార్ అన్నాజీరావు తెలిపారు. బుధవారం దేవవరంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పలువురు తమకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని, తమ భూములను వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని, పాసు పుస్తకాలు ఉన్నప్పటికి తమ ఖాతా నంబర్లు ఆన్‌లైన్ కాలేదంటూ వినతి పత్రాలు అందజేశారు. వివిధ రెవెన్యూ సమస్యలకు సంబంధించి సుమారు 20 వరకు అర్జీలు అందాయి. డీటీ అన్నాజీరావు మాట్లాడుతూ సదస్సుల్లో ప్రజలు అందజేసిన అర్జీలను పూర్తి స్థాయిలో విచారణ జరిపి తమ పరిధిలో ఉన్న వాటిని 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. తమ పరిధి కాని వాటిని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామన్నారు. ప్రజలు ఇచ్చిన అర్జీలను వెంటనే ఆన్‌లైన్ చేస్తున్నామని, అవి ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ కన్నబాబు, సర్పంచ్ రాఘవకుమారి, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ గొర్ల నర్సింహమూర్తి, వార్డు సభ్యుడు దండు బలరామరాజు, వీఆర్వోలు, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి దోహదం

మునగపాక: రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడుతున్నాయని వీఆర్వో హిమబిందు తెలిపారు. మండలంలోని చూచుకొండలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించి ఎటువంటి వివాదాలకు అవకాశం లేకుండా ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి సూరప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు కాండ్రేగుల కిరణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: రెవెన్యూ సదస్సుల్లో దీర్ఘకాలిక భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. పెనుగొల్లు గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 17 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అర్జీలకు నిర్దేశిత సమయంలో పరిష్కారం చూపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఉద్దండం సూర్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చూచుకొండలో మాట్లాడుతున్న వీఆర్వో హిమబిందు



పెనుగొల్లు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు